సాక్షి ఆదిలాబాద్

శనివారం । 7 । జనవరి । 2023



భవితకు బంగారు బాట

నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు గడువు ఉంది.

8లో▸



కలెక్టర్‌కు శుభాకాంక్షలు


కైలాస్‌నగర్: కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, జేఈ శివాని ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /09.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతంతో పాటు రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది.

తొలి హిట్టు



న్యాస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కనీస సామర్థ్యాలు గతంలో తక్కువగా ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. చాలామంది చదవడం, రాయడం చేయలేకపోయారు. చతుర్విద ప్రక్రియల్లోనూ వీక్‌గా ఉన్నట్లు తేల్చారు. ఈ క్రమంలో తొలిమెట్టు కార్యక్రమం ద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించిన ఉపాధ్యాయులు వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. జూలై నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల పాటు ఆయా సబ్జెక్టులపై బోధన చేసి ఆరో రోజు స్లిప్ టెస్టులు నిర్వహించారు. ఫలితంగా విద్యార్థుల సామర్థ్యాలు మెరుగయ్యాయి. ఇటీవల నిర్వహించిన మ ధ్యంతర న్యాస్ ఫలితాల్లో ఇది వెల్ల డైంది. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఇలాంటి పురోగతే కనిపిస్తోంది.

- జిల్లాలో మెరుగైన విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు
- ఓవరాల్‌గా 47 నుంచి 80 శాతం వరకు పెరుగుదల
- మధ్యంతర 'న్యాస్' ఫలితాల్లో వెల్లడి
- ఫలితమిచ్చిన 'తొలిమెట్టు'

న్యాస్ సర్వే ఫలితాలు ఇలా..

	లాంగ్వేజ్		గణితం		ఈవీఎస్	
సంవత్సరం	2019	2022	2019	2022	2019	2022
3వ తరగతి	50	80	51	77	48	76
5వ తరగతి	43	80	41	67	40	70

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి. విద్యాపరంగా ఇదివరకు ఆదిలాబాద్ జిల్లా జాతీయస్థాయిలో వెనుకబడినట్లు సర్వేలో తేలింది. విద్యార్థులు చదవడం, రాయడంలో వీక్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఎస్‌సీఈఆర్టీ అసంతృప్తి వ్యక్తం చేయడంతో విద్యాశాఖ అలర్ట్ అయింది. ప్రత్యేక దృష్టి సారించి తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అలాగే ఆర్‌జేడీ స్థాయి అధికారిని జిల్లాకు పరిశీలకులుగా నియమించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయులు సైతం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇది కొంత ఫలితమిచ్చింది. సర్వేకు ముందు 47శాతం ఉన్న విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు ఇటీవల వచ్చిన న్యాస్ మధ్యంతర ఫలితాల్లో 80 శాతానికి పెరగడం గమనార్హం.

'తొలిమెట్టు'తో ముందడుగు..

జాతీయ స్థాయిలో విద్యాపరంగా పది జిల్లాలు వెనుకబడి ఉండగా అందులో ఆదిలాబాద్ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. జూలై నుంచి తొలిమెట్టు కార్యక్రమం ద్వారా 3 నుంచి పదో తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బోధన చేపట్టారు. వారంలో ఐదు రోజుల పాటు బోధన చేసి, ఒకరోజు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఆర్‌జేడీ, డీఈవో, సెక్టోరియల్ అధికారులు తరచూ పర్యవేక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాలపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు.

ప్రత్యేక చొరవతోనే..



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గతంలో 47 శాతం ఉండగా ఇటీవల నిర్వహించిన న్యాస్ పరీక్షలో 80 శాతానికి పెరిగింది. సామర్థ్యాల పెంపు కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించాం. కలెక్టర్, ఆర్‌జేడీ, సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణతో మంచి ఫలితాలను రాబట్టాం. తుది పరీక్ష నాటికి మరింతగా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించి జిల్లాను మరింత మెరుగైన స్థితిలో ఉంచుతాం. చదువుల పరంగా వెనుకబడిన జిల్లా నుంచి బయట పడటం చాలా సంతోషంగా ఉంది. అందరి కృషి తోనే ఇది సాధ్యమైంది.

– టి.ప్రణీత, డీఈవో

పెరిగిన సామర్థ్యం..

2017, 2019, 2021 సంవత్సరాల్లో న్యాస్ పరీక్ష నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలు 47 శాతానికి పడిపోయాయి. ఆయా తరగతుల విద్యార్థులు కనీసం చదవలేని, రాయలేని స్థితిలో ఉండటంపై ఎస్‌సీఈఆర్‌టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ వహించి తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసింది. గతేడాది నవంబర్ 22న నిర్వహించిన మధ్యంతర న్యాస్ పరీక్ష ఫలితాలు ఇటీవల వెల్లడయ్యాయి. ఇందులో విద్యార్థుల కనీస సామర్థ్యాలు 80 శాతానికి పెరిగినట్లు ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించింది. 3వ తరగతిలో ప్రైవేట్ విద్యార్థుల సామర్థ్యం 80 శాతం ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామర్థ్యం 82 శాతం ఉన్నట్లుగా నిర్ధారించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సామర్థ్యం 68 శాతం ఉండగా, పట్టణ ప్రాంత విద్యార్థుల సామర్థ్యం 86 శాతం ఉన్నట్లుగా గణాంకాలు వెల్లడించాయి. మొత్తం మీద జిల్లాలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెరగడంపై అధికారులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీలో సైలెంట్ వార్

- ఎంపీ సోయం, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ మధ్య విభేదాలు
- ఖానాపూర్ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎంపీ
- అంతర్గతంగా ఇతర నేతలను ఎంపీ ప్రోత్సహిస్తున్నారన్న ప్రచారం..
- ఆసక్తి కలిగిస్తున్న పార్టీ పరిణామాలు



ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు



మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీలో ఇద్దరు ముఖ్య నేతల మధ్య సైలెంట్ వార్ ప్రచారం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పైకి ఎలాంటి విభేదాలు లేవన్నట్టుగా కనిపిస్తున్నా అంతర్గతంగా మాత్రం బలంగానే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్‌ల మధ్య ఇటీవల జరిగిన పరిణామాలు ఈ సైలెంట్ వార్‌ను స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విభేదాలకు ప్రత్యేకంగా కారణం కనిపించకపోయినా రానున్న ఎన్నికల నేపథ్యంలో రాజకీయ భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని ఇద్దరి మధ్య ఎడమొహం.. పెడమొహం అన్నట్టుగా వ్యవహారాలు సాగుతున్నాయని వినిపిస్తుంది.

పట్టు కోసం యత్నాలు..

రాజకీయంగా అనేక ఉత్థానపతనాలు చూసిన రమేశ్‌రాథోడ్ 2021 జూన్‌లో ఈటల రాజేందర్‌తో కలిసి బీజేపీలో చేరారు. తిరిగి రాజకీయాల్లో క్రియాశీలకం కావాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట్లో ఆయన చేరికను ఎంపీ సోయం బాపూరావు వ్యతిరేకించారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు తొలిగి పార్టీ కార్యక్రమాల్లో కలిసి పాల్గొన్నారు. అయితే కొంత కాలంగా మళ్లీ ఇద్దరి మధ్య సఖ్యత లేదని ప్రచారం సాగుతుంది. ఐదు నెలల క్రితం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా యాత్ర అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించాలని అధిష్టా నం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఖానాపూర్ నియోజకవర్గంలో రమేశ్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఆ యాత్ర ఈటల రాజేందర్‌తో నిర్వహిస్తున్నారనే ప్రచారం అప్పట్లో జరిగింది. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ.. ఆ యాత్ర నిలిచిపోయింది. ఈ ఇరువురి మధ్యలో విభేదాల కారణంగానే ఈ యాత్ర జరగలేదని పార్టీలో కార్యకర్తల మధ్య చర్చ సాగింది.

ఎడమొహం.. పెడమొహం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రమేశ్‌రాథోడ్ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా, జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించారు. 2014 ఎన్నికల తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత 2018 ఎన్నికలకు కొద్ది నెలల ముందు కాంగ్రెస్‌లో చేరి ఖానాపూర్ నుంచి అసెంబ్లీకి పోటీ చేశారు. అప్పుడు రేఖానాయక్ చేతిలో ఓటమి చెందారు. ఆ తర్వాత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి ప్రస్తుత ఎంపీ సోయం బాపూరావు చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన ఆయన వచ్చే ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి పార్టీ పరంగా టికెట్‌ను ఆశిస్తూ అక్కడ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న సీనియర్ నాయకులు హరినాయక్, పెంబీ జెడ్పీటీసీ జానుబాయిలను అంతర్గతంగా ఎంపీ సోయం బాపురావు ప్రోత్సాహం అందిస్తున్నారని పార్టీలో చర్చించుకుంటున్నారు. మొత్తంగా ప్రస్తుతం కమలం పార్టీలో ఇద్దరు ముఖ్య నేతల మధ్య విభేదాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

'మన ఊరు–మన బడి' వేగవంతం చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కైలాస్‌నగర్: మన ఊరు–మన బడి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మన ఊరు–మన బడి కింద జిల్లాలో ఎంపిక చేసిన 37 మోడల్ స్కూళ్లలో చేపట్టిన పనులను ఈ నెల 15లోగా పూర్తి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ కింద పాఠశాలల్లో చేపట్టే మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. వచ్చే నెలాఖరులోగా ప్రారంభానికి సుందరీకరణతో సహా పూర్తిచేయాలన్నారు. పనుల వివరాల రికార్డులను వెంటవెంటనే అప్లోడ్ చేయాలన్నారు. రూ.30 లక్షల లోపు పనులను పూర్తిగా గ్రౌండింగ్ చేయాలన్నారు. పాఠశాలల్లో పెయింటింగ్, క్లీనింగ్ వంటి పనులు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, డీఈవో ప్రణీత, డీఆర్డీవో కిషన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

నేరడిగొండ: స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. రుణాలతో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శోభన, సర్పంచ్ సమత, ఉప సర్పంచ్ షేక్ ఫయజ్ , పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి తదితరులున్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్కీం వర్కర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుజాత, పార్వతి, మధునిక, విమల, ప్రమీల, శోభ, సురేఖ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో బోధన సులభతరం



బోధనోపకరణాలు పరిశీలిస్తున్న డీఈవో

తాంసి: విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులకు బోధనోపకరణాలు దోహదపడుతాయని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను శుక్రవారం ఆమె ప్రారంభించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకరణాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం నిర్వహించిన తొలిమెట్టు కార్యక్రమం సత్ఫలితం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, రాజన్న, కిష్టన్న, రాజేశ్వర్, సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ప్రత్యేకాధికారి అలేఖ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

రేషన్ పంపిణీ మరింత ఆలస్యం

కైలాస్‌నగర్: ఈ నెల 7న ప్రారంభం కావాల్సిన రేషన్ బియ్యం పంపిణీ సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతున్నట్లు డీఎస్‌వో కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

10న డీడీవోలకు అవగాహన సదస్సు

కైలాస్‌నగర్: జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు ఈనెల 10న ఇన్‌కం టాక్స్, టీడీఎస్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న సదస్సుకు జిల్లాలోని డీడీవోలు అందరూ హాజరు కావాలని సూచించారు.

గిట్టుబాటు ధర కల్పనలో కేంద్రం విఫలం



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

కైలాస్‌నగర్: పత్తి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల పక్ష రైతు సంఘం నాయకులు ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో శుక్రవారం వారు సమావేశమయ్యారు. పత్తి రైతుకు మద్దతుగా ప్రభుత్వంపై పోరాడేందుకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నాణ్యమైన పత్తి సేద్యానికి ఆసియాలోనే ఆదిలాబాద్ జిల్లా పేరు గాంచిందన్నారు. ఈ క్రమంలో రైతుకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం శోచనీయమన్నారు. ఈ నెల 12న ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద చేపట్టనున్న ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు కిష్టు, పోశెట్టి, దత్తాత్రి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

27 రేషన్‌షాపులు.. 348 దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ గడువు
- 22న రాత పరీక్ష



దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో కార్యాలయ సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. మొత్తం 27 దుకాణాల భర్తీ కోసం గత నెల 21నుంచి ఈ నెల 6 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 348 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష ఉంటుందని ఆర్డీవో రాథోడ్‌రమేశ్ తెలిపారు. అర్హులైనవారికి ఈనెల27న ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

ఆదిలాబాద్‌రూరల్: లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. మావల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏఈవో, ఏవో, ఏడీఏలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని రైతులతో ప్రతి మంగళ, శుక్రవారం సమావేశాలు నిర్వహించి ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్ల వారీగా కేటాయించిన సాగు విస్తీర్ణ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రైతుబీమాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, అలాగే ఈ కేవైసీకి ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. యాసంగి సాగు వివరాలు సైతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అంతకు ముందు ఆదిలాబాద్ రూరల్ మండలం కచ్‌కంటి గ్రామంలోని రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బోర్డుల్లోనే.. 'ప్రకృతి'!



కైలాస్‌నగర్‌వాసులకు ఆహ్లాదం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పార్కు ఇది. పెన్సింగ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌సైతం ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణను గాలికొదిలేయడంతో ఇందులో నాటిన మొక్కలు ఎండిపోయి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.



ఇది సుందరయ్యనగర్ సమీపంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద పట్టణ ప్రకృతివనం పేరిట ఏర్పాటు చేసిన బోర్డు. అయితే ఇందులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం గమనార్హం.

- పట్టణ ప్రకృతి వనాల్లో కనిపించని పచ్చదనం
- అందని ఆహ్లాదం.. నెరవేరని సర్కారు లక్ష్యం
- రూ.2కోట్లు వెచ్చించినా ప్రయోజనం శూన్యం

కైలాస్‌నగర్: పట్టణవాసులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనాలు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా దర్శనమిస్తున్నాయి. కేవలం బోర్డులు ఏర్పాటు చేసి మమా అనిపించారనే ఆరోపణలున్నాయి. పార్కులను అభివృద్ధి చేసినట్లు కాగితాల్లో చూపుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అలాంటివి ఏమీ కనిపించడం లేదు. వసతుల పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఆహ్లాదం అందని ద్రాక్షగా మారిందనే విమర్శలున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయిలో కొరవడిన నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది.

ఉద్దేశమేంటంటే

పట్టణ ప్రజల జీవనం యాంత్రీకంగా మారుతున్న నేపథ్యంలో వారికి ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో ప్రజలకు అనువుగా ఉండేలా వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ప్రభుత్వం అందుకు కొన్ని ప్రమాణాలను నిర్దేశించింది. పట్టణ ప్రకృతివనాలు, పార్కుల కోసం ఎంపిక చేసిన స్థలాల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు పూలు, పండ్ల మొక్కలను నాటాలి. వర్షపునీటిని ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలను తవ్వాలి. ఆహ్లాదం కోసం వచ్చే ప్రజలు సేదతీరేందుకు వీలుగా కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలి. వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్‌ను నిర్మించాలి. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పచ్చదనం పెంపొందించాల్సి ఉంటుంది.

బోర్డులకే పరిమితం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల పరిధిలో 53 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసినట్లుగా మున్సిపల్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఒక్కోదానికి రూ.3 నుంచి 20 లక్షల వరకు నిధులు వెచ్చించారు. కొన్ని చోట్ల పెన్సింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి కొన్ని మొక్కలను నాటారు. మరికొన్ని చోట్ల ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. నామమాత్రంగా ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణపై అధికారులు దృష్టిసారించకపోవడంతో నాటిన మొక్కలు ఎండిపోయి పచ్చదనం కొరవడుతోంది. అనువైన స్థలాలు గుర్తించకపోవడం, స్థలాభావ సమస్యలు, ఇతరత్రా కారణాలతో అనేక చోట్ల బోర్డులు పెట్టేసి మమా అనిపించేశారు. నిర్వహణ లోపంతో మొక్కలు ఎండిపోగా, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారయ్యాయి. వాకింగ్ ట్రాక్‌లను సైతం విస్మరించారు. గ్రీన్ బడ్జెట్ పేరిట రూ.2కోట్లను ఖర్చు చేసినట్లుగా చెబుతున్నప్పటికి ప్రకృతి వనాల్లో మాత్రం పచ్చదనం కనిపించకపోవడం గమనార్హం. దీంతో వీకెండ్, సెలవురోజుల్లో ఆహ్లాదం ఆస్వాదించాలనుకునే పట్టణవాసులకు నిరాశే ఎదురవుతుంది.

అంతా మంచిగానే ఉంది

పట్టణ ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించేలా మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. అంతా మంచిగానే ఉంది. ఎలాంటి ఇబ్బంది లేదు. అభివృద్ధి పనులు చేపట్టకుండా కేవలం బోర్డులు పెట్టినట్లుగా ఉన్న పట్టణ ప్రకృతివనాల విషయం నా దృష్టికి రాలేదు.

– యూనిస్, డీఈ, ఆదిలాబాద్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


సోన్‌టాకే శివ(ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన సోన్‌టాకే శివ(26) జాతర్ల గ్రామ సమీపంలో క్వారీలో మడుగులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్సై సయ్యద్ ముజాయిద్ వివరాల ప్రకారం... సోన్‌టాకే శివ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం చేనులో ఉన్న తండ్రి సోన్‌టాకే నగేష్ వద్దకు వెళ్లి మాట్లాడి వెళ్లిపోయాడు. సాయంత్రం భూతాయి గ్రామానికి చెందిన మిత్రుడు వికాస్‌కు ఫోన్‌లో ఎలుకల మందుతాగి చనిపోతానని చెప్పాడు. ఆందోళన చెందిన వికాస్ బోస్రా గ్రామానికి చెందిన ప్రణవ్‌కు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి నుంచి శివ కోసం గాలించగా శుక్రవారం ఉదయం జాతర్ల గ్రామ సమీపంలో క్వారీ మడుగులో శవమై కనిపించాడు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి సోన్‌టాకే నగేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 17మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్–3, 5 పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండల కేంద్రంలోని త్రిదేవి డిగ్రీ కళాశాలలో 10మంది విద్యార్థులు, చైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖాశ్యామ్ కళాశాలలో ఒకరు, మంచిర్యాలలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు, భవిత డిగ్రీ కళాశాలలో ఒకరి చొప్పున విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

గురువుపై అభిమానం.. పాఠశాలకు రూ.లక్ష విరాళం


చెక్కును అందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమేశ్‌రావ్

బోథ్: చదువు చెప్పిన గురువుపై అభిమానంతో ఓ శిష్యుడు పాఠశాలకు రూ.లక్ష విరాళంగా అందించాడు. అమెరికాలో ఉంటున్న నిర్మల్ జిల్లా పొన్కల్ గ్రామానికి చెందిన పి.ప్రశాంత్ తన గురువు బోథ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమేష్‌రావ్ పాఠశాల అభివృద్ధి కోసం చేస్తున్న తపనను సోషల్ మీడియా, వాట్సాప్‌లో చూసి ప్రిన్సిపాల్ ఉమేష్‌కు రూ.లక్షను పంపించాడు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఉదయం ఎస్‌ఎంసీ సభ్యులకు ప్రిన్సిపాల్ అందజేశాడు. పాఠశాలలో పదో తరతగతి విద్యార్థులు, ఇంటర్ విద్యార్థుల కోసం చదువుకోవడానికి కుర్చీలు, గ్రౌండ్ నవీకరణ, వాలీబాల్, ఖోఖో మైదానాలను ఏర్పాటు చేయడం కోసం ఉపయోగిస్తామని ప్రిన్సిపాల్ ఉమేష్ తెలిపారు. విరాళంగా ఇచ్చిన ప్రశాంత్ అమెరికా నుంచి ఉదయం విద్యార్థులతో జూమ్‌లో ముచ్చటించారు. తన గురువు మీద అభిమానంతో విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.


ఖందేవ్ ఆలయానికి పూజా సామగ్రితో..

మహాపూజకు తొడసం వంశస్తులు

నార్నూర్: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం ఖందేవుడి మహాపూజకు ఆలయం ముస్తాబైంది. మండలంలోని మాన్కాపూర్ గ్రామ సమీపంలోని గోవర్దన్‌గుట్ట వద్ద గల మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేసినంతరం తొడసం వంశస్తులు శుక్రవారం అక్కడి నుంచి కాలినడకన, కొందరు ఎండ్లబండిపై ఖందేవ్ పుణ్యక్షేత్రనానికి బయలుదేరారు. సాయంత్రం ఆలయానికి చేరుకుని రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పుష్యపౌర్ణమి సందర్భంగా మహాపూజ నిర్వహిస్తారు. సంప్రదాయ, సంస్కృతి ప్రకారం దేవుడికి పూజలు చేసినంతరం 15 రోజుల పాటు జాతర కొనసాగుతుందని తొడసం వంశానికి చెందిన కడోడాలు తొడసం బాపురావు, తొడసం రాజు, ఆలయ కమిటీ నిర్వహకులు తొడసం నాగోరావు తెలిపారు.


ఖందేవ్ ఆలయానికి ఎడ్లబండ్లపై వస్తున్న తొడసం వంశస్తులు


మహాపూజకు ముస్తాబైన ఆలయం


ఆలయం వద్ద తొడసం వంశానికి చెందిన పెద్దలు

భవితకు బంగారు బాట



కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

- జవహర్ నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశప్రక్రియ షురూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 వరకు గడువు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యావిభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. విద్యాలయంలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తుకు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2023, ఏప్రిల్ 29న(శనివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభించారు.

అర్హతలు ఇవే..

- 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థులు 2011, మే1 నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించిన వారై ఉండాలి.
- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో నింపబడతాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైన విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుంది.
- బాలికలకు కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

- జిల్లా విద్యాలయంలో సహవిద్యా, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్
- ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎస్‌ఎస్‌ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి, ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ వంటి ఉన్నత పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ
- 'పది' ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టబడి చదవాలి. మరిన్ని వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలి.

– బి.చక్రపాణి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం



బాసర ఆలయంలో పౌర్ణమి పూజలు

బాసర(ముథోల్): పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించి శతఅర్చన పూజలు జరిపించారు. ఆలయ అధికారులు, వైదిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

జనాలను మోసం చేస్తున్న ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- మరో నలుగురి కోసం గాలింపు
- నకిలీ బంగారం, కరెన్సీ స్వాధీనం

నేరడిగొండ: జనాలకు నకిలీ బంగారం అంటగట్టి, నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోల్‌మామడలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా 11 తులాల 30 గ్రాముల బంగారు రంగుగల చైన్‌లతో పాటు రూ.100 నకిలీ నోట్లు గుర్తించారు. వాటిపై చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు, ఇచ్చోడకు చెందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు మొత్తం ఏడుగురు ఒక గ్రూపుగా ఏర్పడి డబ్బులకు ఆశపడి నకిలీ బంగారం వస్తువులను ప్రజలకు అంటగట్టినట్లు ఒప్పుకున్నారు. దీంతో పాటు గత నెల నేరడిగొండలో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2 లక్షలా 30వేలకు 10తులాల బంగారం ఇస్తామని రూ.30వేల నగదును తీసుకున్నారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ ఇలాగే ఒక వ్యక్తి నుంచి రూ.80వేలు తీసుకున్నారు. మోసాలకు పాల్పడుతున్న గ్రూప్‌లోని ముగ్గురు సభ్యులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి వీరిని అదుపులోకి తీసుకోగా శుక్రవారం వివరాలను పోలీసులు తెలుపడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


నకిలీ కరెన్సీ, బంగారం గొలుసు

సంస్కృతిని కాపాడాలి


పూలమాల వేస్తున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన హీరాసుక్క జయంతికి ముఖ్యఅతిథిగా హాజరు కాగా ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా డోలువాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా హీరాసుక్క విగ్రహంతో పాటు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆదిలాబాద్, జైనథ్, బేల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన కుమ్ర విజయలక్ష్మి, రాజు, గొడం వర్ష సునీల్‌లను శాలువతో సత్కరించారు. అనంతరం భోజారెడ్డి మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఆదివాసీలు తమ పిల్లలను చదివించాలని కోరారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్, నాయకులు మనోహర్, మెస్రం కృష్ణ, రామేశ్వర్, అశోక్, దివ్య ఉన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 4,780 మంది అర్హత

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 4,780 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన వారు 2,305, ఓసీ వర్గానికి చెందిన వారు 63 మంది, ఎస్సీలు 988 మంది, ఎస్టీలు 1,424 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 3,740 మంది, మహిళా అభ్యర్థులు 1040 మంది, ఎక్స్ సర్వీస్‌మెన్ కుటుంబాలకు చెందిన వారు 16 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు..

జైనథ్: మండలంలోని గూడ గ్రామానికి చెందిన బండారి దేవన్న అనే వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. గూడ గ్రామానికి చెందిన మడావి రాజును అదే గ్రామానికి చెందిన బండారి దేవన్న అనే వ్యక్తి ఈ నెల 3న రాత్రి మద్యం తాగడం కోసం డబ్బులు అడిగాడు. దీంతో మడావి రాజు తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో కోపానికి గురైన దేవన్న రాజును కులం పేరుతో దూషించాడు. అనంతరం గొడ్డలితో రాజుపై దాడి చేశాడు. రాజును స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిందితుడు బండారి దేవన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

అప్షన్లు నమోదు చేసుకోవాలి

ఉట్నూర్: కాళోజీ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ కన్వీనర్ కోటాలో సీటు పొందాలనుకునే గిరిజన విద్యార్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు టీఎస్‌పీఏఆర్‌ఏఎంఈడీ.టీఎస్‌సీహెచ్‌ఈ.ఇన్ వెబ్ సైట్‌లో వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు నాలుగేళ్లు, బీపీటీ రెండేళ్ల కోర్సులో చేరాలనుకునే గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీట్ల ఖాళీల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.

'రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దు'

తలమడుగు: మండల కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దని గ్రామస్తులు రైల్వే అధికారులకు విన్నవించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరైందని రైల్వే అధికారులు శంకర్, జిల్లా ఆర్‌డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ రాగా గ్రామస్తులు అండర్ బ్రిడ్జి నిర్మించవద్దని రైతులు, గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. గత ఏడాది మండలంలోని ఖోడధ్, ఉండమ్ గ్రామాల సమీపంలో అండర్ బ్రిడ్జి నిర్మించారని, వర్షాకాలంలో పంట పొలాలకు, గ్రామాలకు వెళ్లేందుకు వీలులేకుండా పూర్తిగా అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోతోందని తెలిపారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని తెలిపారు. పంట పొలాలకు వెళ్లేందుకు ఈ ఒక్కటే మార్గం ఉందన్నారు. ఇందులో ఆర్‌డీవో రమేష్ రాథోడ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.


రైల్వే అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్తులు

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు


నిందితులతో ట్రాఫిక్ పోలీసులు

నిర్మల్‌చైన్‌గేట్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఇటీవల పట్టణంలో వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వా రిని నిర్మల్ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేసిన న్యాయమూర్తి ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు మరో 67మందికి కలిపి రూ.83,500 జరిమానా విధించారు.

ఖానాపూర్‌లో మరో ఇద్దరికి..

ఖానాపూర్: పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందికి ఖానాపూర్ కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. తొమ్మిది మందికి రూ.18వేల జరిమానాతో పాటు ఇద్దరికి 24గంటల జైలు శిక్ష విధించారు.

కోడి పందెం రాయుళ్లపై కేసు

బేల: మండలంలోని చంపెల్లి, పొనాల రెవెన్యూ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రెండు కోళ్లు, రూ.1,670 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మహారాష్ట్రకు చెందిన ఐదుగురిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు..

నటరాజ్ డీలక్స్ థియేటర్ సీజ్


నటరాజ్ డీలక్స్ థియేటర్ ద్వారానికి వేసిన సీల్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని నటరాజ్ డీలక్స్ థియేటర్‌ను మున్సిపల్ అధికారులు శుక్రవారం సాయంత్రం సీజ్ చేశారు. జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ ఇటీవల ఆ థియేటర్‌లో సినిమాను తిలకించేందుకు వెళ్లారు. థియేటర్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించిన ఆమె మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బల్దియా పారిశుధ్య విభాగం పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో థియేటర్‌ను సందర్శించిన బల్దియా అధికారులు మూత్రశాలల్లో నిర్వహణ లోపాన్ని గుర్తించారు. ఈ మేరకు థియేటర్‌ను సీజ్ చేసి తాళం వేశారు.

కార్యదర్శి దంపతులకు అండగా ఉంటాం

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి దంపతులకు అండగా ఉంటామని నిర్మల్ అడిషనల్ కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. తానూర్ మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న గోపినాథ్, జయశ్రీ దంపతులు విధులు ముగించుకొని సాయంత్రం సమయంలో ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో తానూర్ మండలంలోని హిప్పెల్లి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ హేమంత్ బొర్కడే శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దంపతులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీడీవోలు, ఎంపీవోలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మన్నాపూర్‌కు మెస్రం వంశస్తుల పాదయాత్ర



నార్నూర్: పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామానికి చేరుకుంది. గ్రామానికి వచ్చిన మెస్రం వంశీయులను గ్రామపటేల్ మెస్రం రూప్‌దేవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సంప్రదాయంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మన్నాపూర్ నుంచి శనివారం ఉదయం జైనూర్ మండలంలోని లెండిజాల గ్రామానికి చేరుకుంటారు.

మంత్రికి పరామర్శ

ఖానాపూర్: బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు పితృవియోగం కావడంతో మంత్రిని టీజీఓ జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


పుష్పాంజలి ఘటిస్తున్న శ్యాంనాయక్